

# మంత్రగాడి మంత్రం

— గుంటక సాంబిరెడ్డి

“మంత్రాలూ, మంత్రగాళ్ళూ అంతా బోగస్. నేను నమ్మనుకాక నమ్మను” అన్నాడు రామారావు.

“నువ్వు నమ్మితే ఎవడిక్కావాలి, నమ్మకపోతే ఎవడిక్కావాలి? మంత్రాలూ నిజమే, వాటిని ప్రయోగించి అద్భుత కార్యాలు సాధించగల మంత్రగాళ్ళు మన దేశంలో వున్నమాటా నిజమే” అని రామారావుని ఖండించాడు వెంకట్రావు.

“నువ్వెవరన్నా మంత్రగాళ్ళనుగానీ, వాళ్ళ మంత్ర ప్రయోగాల్ని గానీ ప్రత్యక్షంగా చూశావా?” అని ప్రశ్నించాడు రామారావు.

“మా వూళ్ళో నా చిన్నప్పుడు చాలా మంది మంత్రగాళ్ళుండేవాళ్ళు. ఇప్పుడు తగ్గిపోయారనుకో. అయినా యింకా అక్కడక్కడా వున్నారు” అన్నాడు వెంకట్రావు చిన్నతనపు రోజులు గుర్తుతెచ్చుకుంటూ.

“మీ వూళ్ళో పచ్చగా వున్న చెట్టుని ఒక్క క్షణంలో మాడ్చివేయగల మంత్రగాడెవడైనా వున్నాడా? మా వూళ్ళో

అలాంటి మంత్రగాడున్నాడు" అన్నాడు ప్రసాద్.

"ఓస్! అంతేగదా! మా ఊళ్ళో చెట్టుల సుబ్బయ్యని ఒక మంత్రగాడుండేవాడు. వాడికీ, పొరుగింటి రామయ్యకూ ఒకసారి తగాదా వచ్చింది. సుబ్బయ్యకు కోపంవచ్చి ఏం చేశాడో తెలుసా? రామయ్య పొలంలో వున్న ఒక పెద్ద తుమ్మచెట్టుని— చాలా పెద్ద చెట్టులే ఆ చెట్టు మొదలుతో నాలుగైదు నాగటి దుంపలు చెయ్యొచ్చు. మిగిలిన చెట్టు కట్టెలు ఒక సంసారానికి సంవత్సరంపాటు సరిపోతాయి. అంత పెద్ద చెట్టునీ సుబ్బయ్య మంత్రం ప్రయోగించి ఒక్క రాత్రిలో మటుమాయం చేశాడు. సాయంత్రం చక్కగా వున్న చెట్టు తెల్లవారేసరికి వ్రేళ్ళతోసహా మాయమైపోయింది. ఆఖరుకు అక్కడ చెట్టు వున్న గుర్తులు కూడా లేవు. చెట్టుల సుబ్బయ్య శక్తుల గురించి ఇప్పటికీ మా వూళ్ళో కథలు చెప్పుకుంటారు. తెలుసా?" అన్నాడు వెంకట్రావు గొప్పగా.

"మా వూరి గట్టుల నరసయ్యతో పోలిస్తే మీ వూరి చెట్టుల సుబ్బయ్య బేతాళుడిముందు కరాళుడంతటి చిన్న మంత్రగాడు" అన్నాడు ప్రసాద్ గర్వంగా.

"అంత గొప్పవాడేమిటీ మీ గట్టుల నరసయ్య?" ఆశ్చర్యపోయాడు సుబ్రహ్మణ్యం.

"ఆహా! మా వూరి గట్టుల నరసయ్య తీక్షణంగా చూస్తేచాలు. చేలగట్లు వాటంతటవే ప్రక్కకు జరిగిపోతాయి. మా వూళ్ళో నరసయ్యకూ, వెంకయ్యకూ ప్రక్క ప్రక్కనే పొలాలున్నాయి. ఒకసారి నరసయ్యకెందుకో వెంకయ్యతో పేచీవచ్చి మంత్రం వేశాడు. దానితో గట్లు జరిగిపోయి వెంకయ్య పొలం సంవత్సరంలోనే పది సెంట్లు కుదించుకుపోయింది. ఏమిటనుకున్నారో?" అన్నాడు ప్రసాద్.

"హ్హ హ్హ హ్హ" అంటూ నవ్వాడు వెంకట్రావు. "గట్టుల నరసయ్య గురించే నువ్వంత గొప్పగా చెబుతుంటే మా వూరి మంత్రాల బ్రహ్మయ్య గురించి నేనెంత గొప్పగా చెప్పుకోవాలి గురూ! మావూరి మంత్రాల బ్రహ్మయ్యకు ఈ లోకంలో అసాధ్యమైన పనేలేదు. తలుచుకుంటే ఏదైనా చెయ్యగలడు.

నా చిన్నప్పుడు ఒక సారేమైందో చెబుతాను వినండి. మా బాబాయికి అప్పుడు కేరళకు నూకలు ఎగుమతి చెయ్యటానికి పర్మిట్టుండేది. వారం వారం వేల బస్తాల నూకలు ఎగుమతి చేస్తుండేవాడు, లారీల్లో, రైల్వే వ్యాగన్లలో. ఒకసారి పది వ్యాగన్ల బియ్యం నూకలని చెప్పి ఎగుమతి చెయ్యటానికి ప్రయత్నించాడు. బియ్యం బస్తాలు వ్యాగన్లలో వేశారు. అన్ని ఏర్పాట్లూ పూర్తయి ఇంక రైలు బయలుదేరటానికి సిద్ధంగావున్న సమయంలో నూకల పేరుతో బియ్యం ఎగుమతి చేస్తున్నాడని ఎలా తెలిసిందో ఏమిటో సి. ఐ. డీ. లొచ్చేశారు. వాళ్ళని లొంగదీసుకోవాలని మా బాబాయి సామదానభేద దండోపాయాలన్నీ ప్రయోగించాడుగాని వాళ్ళు లొంగలేదు. వాళ్ళు అన్ని వ్యాగన్లూ చెక్‌చేసి అన్నీ బియ్యమేనూ, నూకలు కాదు అని నిర్ధారణ చేసుకుని వ్యాగన్లన్నింటికీ తాళాలు వేసి, సీళ్ళు వేసి వెళ్ళిపోయారు....

"అప్పుడిక చేసేదిలేక మా బాబాయి వెళ్ళి మహా మాంత్రికుడు బ్రహ్మయ్యను ఆశ్రయించాడు. ఆ రోజుల్లో బ్రహ్మయ్యను మించిన మంత్రగాడు దేశంలోనే లేడని చెప్పుకునేవారు. గొప్ప గొప్ప మంత్రిగాళ్లూ నాయకులూ కూడా వచ్చి బ్రహ్మయ్య సహాయం కోరేవారనుకోండి.

మా బాబాయి చెప్పినదంతా విని సహాయం చెయ్యటానికి బ్రహ్మయ్య అంగీకరించాడు. ఇంక చూసుకోండి మరి బ్రహ్మయ్య మంత్ర ప్రయోగం మహిమ.

"మళ్ళా పదిరోజుల్లో మా బాబాయిమీద కేసుపెట్టటానికి సి. ఐ. డీ.లు మేజిస్ట్రేటుతోనూ, మిగిలిన ఆఫీసర్లతోనూ వచ్చారు. వాళ్ళు వచ్చిచూస్తే యెక్కడి వ్యాగన్లు అక్కడే వున్నాయి. వేసిన తాళాలు, సీళ్ళు అన్నీ చెక్కు చెదరకుండా అలాగే వున్నాయి. కాని వ్యాగన్లు తెరిచిచూస్తే ఏముందీ! లోపల అన్నీ నూకల బస్తాలేగాని ఒక్క బియ్యం బస్తా అన్నా లేదు. ఏ బస్తాలోనూ అన్నీ నూకలేగాని ఒక్క బియ్యంగింజన్నా లేదు. బ్రహ్మయ్యగారి మంత్రంతో అన్నిబస్తాల బియ్యమూ నూకలైపోయాయన్నమాట. అది చూసిన సీ.ఐ.డీ. లంతా తెల్లమొహం వేసి, బ్రహ్మయ్యకు జోహారు లర్పించి తోక ముడుచుకుని తిరిగి వెళ్ళిపోయారు. అట్లాంటిదీ బ్రహ్మయ్య మంత్ర మహిమ" అని ముగించాడు.

"ఇవన్నీ బోగస్. వీటన్నిటి వెనకా ఏదో ఒక తంత్రం వుండే వుంటుంది. తెలివితక్కువ జనాన్ని మభ్యపెట్టి వీళ్ళు మంత్రగాళ్ళుగా చెలామణీ అవుతున్నారు. నేను నమ్మను" అన్నాడు రామారావు.

"అయితే వాటిని నమ్మే మేమంతా తెలివి తక్కువ వాళ్ళమూ, నీ వొక్కడివే తెలివిగలవాడివీ అనుకుంటున్నావన్నమాట" అన్నాడు ఉక్రోషంగా వెంకట్రావు.


"ఇవన్నీ మంత్రాలతోనే సాధించారని నువ్వేమైనా రుజువు చెయ్యగలవా వెంకట్రావ్?"

"తప్పకుండా రుజువు చెయ్యగలను. పోనీ నాకు తెలిసిన మంత్రగాడొకడున్నాడు దగ్గరలోనే. అతడితో నీ మీదేమైనా మంత్రప్రయోగం చేయించమంటావేమిటి. నాకు రుజువూ దొరుకుతుంది. నీ తిక్కా అణుగుతుంది" అన్నాడు వెంకట్రావు కసిగా.

"ఓయస్, తప్పకుండా. నా మీద నీ యిష్టం వచ్చిన మంత్రగాడితో నీకు నచ్చిన ప్రయోగం చేయించుకో" అని ఛాలెంజీ చేశాడు రామారావు.

"ఏదన్నా చిన్న ప్రయోగం చేయించు గురూ. పెద్దదయితే మనవాడు ఛస్తే- ఆ పాపం మనకే చుట్టుకుంటుంది" అని సలహా యిచ్చాడు సుబ్బారావు.

"అయితే దానికి షరతులు పకడ్బందీగా



వుండాలి" అన్నాడు ప్రసాద్.

"మీ యిష్టం వచ్చిన షరతులు పెట్టు కోండి" నిర్లక్ష్యంగా అన్నాడు రామారావు.

వెంకట్రావు కొంచెంసేపు ఆలోచించి షరతులు చెప్పాడు. ఎవ్వరూ మర్చిపో కుండా వుండటానికిగాను అవి ఒక పేపర్ మీద వ్రాశాడు సుబ్బారావు. అవి:—

1. వెంకట్రావు రామారావు మీద ఏదన్నా మంత్ర ప్రయోగం చిన్నది చేయించాలి. రామారావు ప్రాణాలకు ప్రమాదమొచ్చేంత పెద్దవి చేయించరాదు. ప్రయోగమేమిటో, ఫలితాలేమిటో వెంకట్రావు ముందుగానే అందరికీ చెప్పాలి.

2. రామారావు పైకి బింకంగా వున్నా రహస్యంగా దానికి తిరుగుబడిలాంటివి చేయించకూడదు. అతడు ఏ రకమైన తాయెత్తులూ, ఆంజనేయస్వామి బిళ్ళలూ వంటిమీద ధరించరాదు.

3. రామారావు ప్రతిరోజూ వచ్చి క్లబ్బులో కనిపించాలి. అతడి ఆరోగ్యం గురించి మిగతా వారంతా తెలుసుకోవటానికీ, పరీక్షించటానికీ వీలుగా.

4. ఈ విషయం ఎవ్వరూ ఇంటి దగ్గర ఆడవాళ్ళకు చెప్పకూడదు. చెప్పితే వాళ్ళు భయపడే ప్రమాదం వుంది గనుక.

"ఎందుకులే గురూ ఈ లేనిపోని ప్రమాదాలతో చెలగాటాలు. ఇది ఇంతటితో డ్రాప్ చేద్దాం" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"రామారావుకు భయంగా వుంటే అలాగే చేద్దాం" అన్నాడు వెంకట్రావు.

"నాకేం భయంలేదు. నీకు ఓడిపోతానని భయంగా వుండి గౌరవంగా తప్పుకుందామనుకుంటే మానేద్దాం" అని రెచ్చగొట్టాడు రామారావు.

"గెలుపు నాదే" అన్నాడు వెంకట్రావు దృఢంగా

"నువ్వు గెలుస్తావో: ఓడిపోతావో తర్వాత తెలుస్తుందిలే. ముందు మంత్రగాడి దగ్గరకెళ్ళి వివరాలు తెలుసుకురా! వాడిని జాగ్రత్తగా చేసుకోమని చెప్పు ప్రయోగం." ఎగతాళిగా అన్నాడు రామారావు.

* * *

"మంత్రగాడి దగ్గరకు వెళ్ళొచ్చాను. రేపు అర్థరాత్రి ప్రయోగం చేస్తానన్నాడు. అతడు చేయబోయే మంత్ర ప్రయోగం వల్ల రామారావు ఎల్లుండినుంచీ వారంరోజుల పాటు అనారోగ్యంతో బాధపడతాడు. వారం తర్వాత ఆటోమాటిక్‌గా కోలుకుంటాడు. ఈ వారంరోజులూ ఎందరు డాక్టర్లుచూసినా, ఎన్ని మందులు వాడినా అతడి అనారోగ్యం తగ్గదు" అన్నాడు వెంకట్రావు వుత్సాహంగా.

చూద్దాం అన్నట్లు నిర్లక్ష్యంగా తల ఎగరేశాడు రామారావు.

"మంత్రగాడికి నీ వెంట్రుకలు కొద్దిగా కావాలి. రేపు సాయంత్రం అవి తీసుకెళ్ళి అతనికి ఇస్తాను" అన్నాడు వెంకట్రావు రామారావుతో.

"అలాగే" అన్నాడు రామారావు.

మర్నాడు క్లబ్బుకు అందరికంటే ఆలస్యంగా వచ్చాడు రామారావు. అందరూ అతడికోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. రామారావు భయపడిపోయినట్లున్నాడు. అందుకనే రాలేదు అని ప్రచారం మొదలుపెట్టాడు వెంకట్రావు.

రామారావు క్లబ్బుకు వస్తూనే వెంకట్రావు చేతికొక చిన్నపొట్లం యిచ్చాడు. "ఇందులో నీక్కావలసిన వెంట్రుకలున్నాయి చూసుకో" అన్నాడు.

పొట్లం తడిమి చూసి "చూడనక్కరలేదులే" అని జేబులో పెట్టుకున్నాడు వెంకట్రావు.

"నేను ఈ వెంట్రుకలివ్వటానికి మంత్రగాడి దగ్గరకు వెళ్ళుతున్నాను. మీలో రాదల్చిన వారెవరైనా రావచ్చు" అన్నాడు వెంకట్రావు.

అందరూ రామారావునే కూడా వెళ్ళమని బలవంతం చేశారు. కాని రామారావందుకు ఒప్పుకోలేదు.


"నాకు మంత్రగాడి దగ్గరకు రావాలనీ, అతడిని చూడాలనీ ఇంటరెస్టు లేదు. వెంట్రుకలు కావాలన్నారు. యిచ్చాను. అతడిష్టమొచ్చిన ప్రయోగం చేసుకోమనండి" అన్నాడు.

చివరకు వెంకట్రావుతోపాటుగా సుబ్బారావు 'మంత్రగాడి దగ్గరకు బయలుదేరాడు. మర్నాడు క్లబ్బులో అందరూ కలవాలనుకున్నారు.

మర్నాడు వెంకట్రావూ, సుబ్బారావూ తప్ప అందరూ టైమ్‌కే క్లబ్బు కొచ్చేశారు. రామారావులో అనారోగ్య లక్షణాలేం కనిపించలేదు ఎవ్వరికీ. అందరూ అతడి ఆరోగ్యం గురించి గుచ్చిగుచ్చి ప్రశ్నించారు. రోజూకంటే కులాసాగా కనిపించాడు రామారావు.

వెంకట్రావూ, సుబ్బారావూ ఇంకా రాలే






దేమిటి చెప్మా అని అందరూ ఆతృతగా ఎదురుచూస్తుండగా చాలా సేపటికి సుబ్బారావొక్కడూ వొచ్చేడు క్లబ్బుకి.

"నిన్న ప్రయోగం చేశాడా మంత్రగాడు?" అని ఆతృతగా సుబ్బారావుని ప్రశ్నించారంతా.

"ఆహా! ఇవ్వాళ ప్రొద్దున కూడా మంత్రగాడి దగ్గరకు వెళ్ళి వచ్చాను. రాత్రే ఆ ప్రయోగం చేశాడట. దాని ప్రభావం వల్ల రామారావు వారం రోజుల పాటు భరించరాని కడుపు నొప్పితో బాధపడతాడట. ఎలా వుంది రామారావ్ వొంట్లో?" అని ప్రశ్నించాడు సుబ్బారావు.

"నాకేం నేను నిక్షేపంలా వున్నాను. రోజూ కంటే హాయిగా వుంది వొంట్లో. ఇంతకూ వెంకట్రావేడీ?" అన్నాడు రామారావు.

"వెంకట్రావుకు ఊర్నించి టెలిగ్రాం వచ్చింది అర్జెంటుగా రమ్మని. ఇవ్వాళ ప్రొద్దున్నే ఊరికెళ్ళాడు. రేపు సాయంత్రానికల్లా తిరిగొచ్చేస్తానన్నాడు. ఒక వేళ రామారావుగాని తన కడుపునొప్పి బాధ భరించలేకపోతే మంత్రగాడి దగ్గరకు వెళ్ళి క్షమాపణ చెప్పుకుంటే ప్రయోగం వారం వరకూ ఆగకుండా వెంటనే తిరగ్గొట్టేస్తాడని చెప్పమన్నాడు" అన్నాడు సుబ్బారావు.

ఆ మాటలు విని రామారావు కులాసాగా చిరునవ్వు నవ్వి విలాసంగా ఒక సిగరెట్ వెలిగించాడు.

వెంకట్రావు మర్నాడు కూడా రాలేదు. ఆ తర్వాతరోజు కూడా రాలేదు. మిగతా వాళ్ళంతా మాత్రం క్లబ్బులో కలుస్తున్నారు. రామారావు ఆరోగ్యం గురించి ఆత్రంగా విచారిస్తున్నారు. రామారావు శుభ్రంగా తిని, తాగి తిరుగుతున్నాడు. అతడి ఆరోగ్యం మామూలుగానే వుంది. మంత్రాలు, మంత్రగాళ్ళపై నమ్మకమున్నవారికి మాత్రం లోపల కుళ్ళుగా వుంది. పైగా వెంకట్రావు కూడా దగ్గర లేడు.

చివరికి వారం రోజులు గడిచాయి. రామారావు ఏ నొప్పీ లేకుండా నిక్షేపంలా వున్నాడు. మిత్ర బృందమంతా అతడి ఆరోగ్యం రోజూ తనిఖీ చేసుకుంటున్నారు. వెంకట్రావు ఊరినుంచి రానేలేదు.

ఆఖరుకు ఎనిమిదో రోజున వెంకట్రావు దిగాడు. మనిషి పీక్కుపోయి చిక్కి సగమైపోయి వున్నాడు. నీరసంగా వున్నాడు. అంతా రామారావుని మర్చిపోయి అతడి చుట్టూ మూగి పరామర్శించారు.

వెంకట్రావుకు ఊళ్ళో పొలం అమ్మకం విషయాలేవో సెటిల్ చెయ్యటంకోసం రమ్మని టెలిగ్రాం యిచ్చారట. వెళ్ళిన రోజే అమ్మకం విషయం సెటిలైందిగాని తిరిగి బయలుదేరుదామంటే విపరీతంగా కడుపులో నొప్పి వచ్చి గిలగిల్లాడాడుట. వారం రోజుల్లో ముగ్గురు డాక్టర్లను మార్చాడుట. ఎక్స్‌రేలు తీయించాడట. జబ్బు ముగ్గురు డాక్టర్లూ మూడు రకాలుగా చెప్పారట. అన్ని రకాల మందులూ అందరు డాక్టర్లిచ్చినవీ వాడాడుట. చివరికి నొప్పి ఎలా వొచ్చిందో అలానే మాయమైందిట.

"అయితే మంత్రగాడు ప్రయోగం రామారావు మీద కాక నీ మీద చేశాడన్న మాట. అందుకే రామారావు నిక్షేపంలా వున్నాడు. కడుపునొప్పి నీకు వచ్చింది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మనమిచ్చింది రామారావు వెంట్రుకలు గదా?" బుర్ర గోక్కుంటూ అన్నాడు సుబ్బారావు.

అయ్యో! అదీ సంగతి!



